ప్రజాశక్తి

గురువారం 23 మే 2024 | 5 | విజయనగరం

సిటియులో పిజి అడ్మిషన్ల గడువు పెంపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ద్వారా అందిస్తున్న వివిధ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు తుది గడువును ఈ నెల 26వ తేదీ రాత్రి 11:55గంటల వరకు పొడిగిస్తున్నట్లు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఎన్‌టిఎ నిర్వహించిన సియుఇటి (పీజీ) పరీక్ష రాసిన వారు పీజీ ప్రోగ్రామ్‌లకు www.ctuap.ac.in గాని, లేదా https://ctuapcuet.samarth.edu.in/pg ద్వారా తమ పేరును ఈనెల 26కు లోపు రిజిస్టర్ చేసుకోవాలని విసి కట్టిమని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ క్యాంపస్ లో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్‌ను లేదా, 6300443499 మొబైలు నెంబర్ ను గాని యూనివర్సిటీ పని వేళలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

నిగనిగంతా దగానే!

నగరంలో ఎక్కడ చూసినా మామిడి పండ్లు కనిపిస్తున్నాయి. చూస్తే నోరూరేలా నిగనిగలాడిపోతున్నాయి. అలా అని కొని నోట్లో వేసుకుంటే పుల్లగా, కాస్త వెగటుగా ఉంటున్నాయి. పక్వానికి రాకముందే కాయల్ని కోసి, రసాయనాల వినియోగంతో వాటిని పండ్లుగా మార్చడం వల్ల కలిగే అనర్థానికి నిదర్శనమిది. మామిడి పండ్లు పూర్తిస్థాయిలో పక్వతతో పండితేనే మంచి రుచి ఉంటుందని తెలిసినా, వాటిని ముందుగానే కోసి, రసాయనాలతో పండించడం వల్ల రుచి ఉండదు సరికదా, ఆరోగ్యానికి హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఈ ప్రక్రియ చట్ట ప్రకారం నేరం కూడా. అయినా వ్యాపారులకు ఇవేవీ పట్టవు. నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

- మామిడి కాయలు మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాల వినియోగం
- రంగే తప్ప రుచి లేని పండ్లతో ఆరోగ్యానికి ప్రమాదం
- అన్నీ తెలిసినా అందరిలోనూ ఉదాసీనతే

రసాయనాలతో మగ్గించిన మామిడిపండ్లు

ప్రజాశక్తి -విజయనగరం కోట

ఉమ్మడి విజయనగరం జిల్లా సుమారు లక్షా 25 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఉత్తరాంధ్రలో విజయనగరం జిల్లాలో మామిడి ఎక్కువగా సాగవుతుంది. కానీ, ఈ ఏడాది జిల్లాలో మామిడి దిగుబడి గణనీయంగా తగ్గింది. సాధారణంగా ఎకరాకు 15 టన్నుల వరకు దిగుబడి వచ్చేది. ఈ ఏడాది ఐదు టన్నుల వరకు దిగుబడి తగ్గింది. స్థానికంగా అమ్మడంతోపాటు కొన్ని ,ప్రాంతాల నుంచి కోల్‌కతా, ఢిల్లీ వంటి నగరాలకు ఎగుమతి చేస్తున్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

ఈ ఏడాది మామిడి దిగుబడి తక్కువగా ఉంది. ఎప్పటిలాగానే పక్వానికి రాక ముందే పంటను కోసేస్తున్నారు. వాటిని ఆకర్షణీయంగా పండించేందుకు నిషేధిత రసాయనాలన్నీ వినియోగిస్తున్నారు.

కార్బైడ్ దొరకని పక్షంలో పొరుగు దేశాల నుంచి దిగుమతి అయిన పౌడర్లు, రసాయనాలతో మామిడిని మగ్గిస్తున్నారు. దీంతో అమృత ఫలాలు కాస్తా విష ఫలాలుగా మారిపోతున్నాయి. ఈ తరహాలో పండించిన మామిడి పండ్లను తినడం ద్వారా జీర్ణక్రియ, కేన్సర్ వంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా మంది రైతులు తమ ఇళ్లలోనే ఒక గదిలో మామిడి కాయలను ఉంచి కార్బైడ్, అగరబత్తి పొగ ద్వారా మగ్గిస్తారు. ఈ తరహాలో మామిడి కాయలను పండుగా తయారు చేయడం వల్ల త్వరగా పండు పక్వానికి వచ్చేయడం, తక్కువ ఖర్చుతో కూడుకోవడంతో అందరూ దీనినే అనుసరిస్తున్నారు. ఇది చట్టరీత్యా నేరం. దీనికి కనీసం 3 నెలల జైలు, రూ.లక్ష జరిమానా విధించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది.

వ్యత్యాసం గుర్తించడం సులువే

సహజంగా పండిన మామిడి పండ్లు, రసాయనాలతో మగ్గించిన మామిడి పండ్లను గుర్తించడంలో ఒక సులువైన మార్గం ఉంది. సహజంగా పండిన మామిడి పండును నీటిలో వేస్తే అది మునిగిపోతుంది. అదే రసాయనాలతో మగ్గించిన పండు అయితే, పండు పెద్దది అయినప్పటికీ, బరువుతో ఉన్నా అది నీటిలో తేలుతుందని రైతులు అంటున్నారు. అంతే కాకుండా సహజంగా పండిన మామిడిపండు అయితే దాని బొడ్డు వద్ద వాసన చూస్తే రుచికరమైన వాసన వస్తుంది. అదే రసాయనంతో పండిస్తే అటువంటి సువాసన రాదు.

ధర అధికమే

మార్కెట్‌లో మామిడి పండ్ల ధర కాస్త అధికంగానే ఉంది. అందరూ ఇష్టపడే బంగినపల్లి మామిడిపళ్లు కిలో రూ.100 వరకు విక్రయిస్తున్నారు. ఇక రైతు బజార్లలో కిలోకు రూ.20 వరకు తగ్గించి అమ్ముతున్నారు. సువర్ణరేఖ, ఇతర జాతుల పండ్లు రూ.80 వరకు అమ్ముతున్నారు. ఇవే డజను లెక్కలు తీసుకుంటే బంగినపల్లి పండు సైజును బట్టి రూ.300 నుంచి రూ.500 వరకు అమ్ముతున్నారు.

రసాయనాలతో మగ్గిస్తే దుష్పరిణామాలు

ప్రస్తుతం మార్కెట్లో నిగనిగలాడుతూ కనిపిస్తున్న మామిడి పండ్లు అన్ని పక్వానికి వచ్చి మగ్గినవి కాదు. పలు రకాల రసాయనాలు కలిపి మగ్గబెడుతున్నారు. వీటివల్ల అనేక రకాలైన సమస్యలు తలెత్తుతాయి. గ్యాస్ట్రిక్, చర్మ సమస్యలు, ఆక్సిజన్ లెవెల్స్ తగ్గిపోవడం, నరాలకు సంబంధించిన సమస్యలు సాధారణంగా వస్తుంటాయి. అదే పనిగా రసాయనాలతో మగ్గపెట్టిన మామిడి పండ్లను అధికంగా తింటే కేన్సర్, కిడ్నీ సమస్యలు, లివర్ సమస్యలు వస్తాయి. రసాయనాలతో మగ్గపెట్టిన మామిడి పండ్లను తినకపోవడం చాలా మంచిది.

- డాక్టర్ వంగపండు నిర్మల

పకడ్బందీగా పరీక్షలు

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ● టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీపై సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఈనెల 24వ తేదీ నుంచి జరగనున్న పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. పదోతరగతి, ఇంటర్, ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు, డిఇఇ సెట్ నిర్వహణపై తన ఛాంబర్‌లో బుధవారం సమీక్షించారు. పరీక్షలకు చేస్తున్న ఏర్పాట్లను ఆయాశాఖల అధికారుల ద్వారా తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, మాల్ ప్రాక్టీస్ జరగకండా చర్యలు తీసుకోవాని ఆదేశించారు. దీనికోసం ఎంపిడిఒలు, తాహశీల్దార్లతో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, సమీపంలోని జెరాక్స్, నెట్ సెంటర్లను మూసి వేయాలని సూచించారు. ప్రశ్నాపత్రాల స్ట్రాంగ్ రూములవద్ద పటిష్ట భద్రత కల్పించాలని, వాటిని తరలించేటప్పుడు తగిన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని చెప్పారు. పరీక్షా కేంద్రాలను ముందుగానే తనిఖీ చేసి, అన్ని వసతులూ కల్పించాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని, ఆర్‌టిసి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు, అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఆయా ప్రభుత్వ శాఖలు కంట్రోలు రూములను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్‌ఒ వనతి, డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్, ఆర్‌ఐఒ ఎం.ఆదినారాయణ, డివిఇఒ ఎస్.భీమశంకర్, డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు, డిఇసి సభ్యులు ఎం.సత్యనారాయణ, కె.అప్పారావు, ఎన్.రామకష్ణ, అసిస్టెంట్ కంట్రోలర్ టి.సన్యాశిరాజు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

24 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

ఈనెల 24 నుంచి జూన్ 3 వరకు పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్ష ఉదయం 9.30కి మొదలై మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతుంది. మొత్తం 4210 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 2482 మంది బాలురు, 1728 మంది బాలికలు ఉన్నారు. వీరికోసం జిల్లా వ్యాప్తంగా 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాలకు 19 మంది ఛీఫ్ సూపరింటిండెంట్‌లను, 19 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 185 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేస్తున్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ

ఈ నెల 24 నుంచి 31 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు 14,904 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 7927 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. మొత్తం 42 పరీక్షా కేంద్రాల్లో, మొదటి సంవత్సర పరీక్ష ఉదయం 9 నుంచి 12 గంటలు వరకు, రెండో సంవత్సర పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు జరుగుతుంది. ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక ఛీఫ్ సూపరింటిండెంట్, మరో అదనపు ఛీఫ్ సూపరింటిండెంట్‌ను నియమించారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, 500 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

24న డిఇఇ సెట్

ఈ నెల 24వ తేదీన డిఇఇ సెట్ జరుగుతుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరిగే ఈ పరీక్ష కంప్యూటర్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో, స్థానిక జెఎన్‌టియు జంక్షన్ సమీపంలోని సత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహిస్తారు. మొత్తం 256 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారు.

జూన్ 1 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ

ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 నుంచి 8 వరకు జరుగుతాయి. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటలు వరకు జరిగే ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. పదోతరగతి పరీక్షలకు 4 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 548 మంది రాయనున్నారు. ఇంటర్ పరీక్షలకు 3 పరీక్షా కేంద్రాల్లో 664 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ప్రతీ పరీక్షా కేంద్రానికి ఒక ఛీఫ్ సూపరింటిండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించారు. రెండు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 65 మంది ఇన్విజిలేటర్లను ఏర్పాటు చేస్తున్నారు. వీరికి ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 10 నుంచి 12 వరకు జరుగుతాయి.

రక్తహీనతపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రక్త హీనతపై శ్రద్ధ వహించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరు క్యార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గర్భిణుల్లో రక్తహీనత, ప్రసవ మరణాలు, తల్లీబిడ్డల నమోదు, ఎబిహెచ్‌ఎ యాప్ నమోదు, ఆసుపత్రి ప్రసవాలు, బర్త్ ప్లానింగు, కంటివెలుగు, 108 వాహనాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ గర్భిణుల్లో రక్తహీనత రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం రక్తహీనత గల గర్భిణులకు అందించిన సేవలపై సమీక్ష నిర్వహించి నివేదిక అందించాలని తెలిపారు. మండల అభివృద్ధి అధికారులు, మహిళాశిశుసంక్షేమశాఖ అధికారులు, వైద్యసిబ్బంది తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ప్రసవ, మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, అన్ని ఆసుపత్రుల్లో సౌకర్యాలు కల్పించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయాలని తెలిపారు. ఆసుపత్రుల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం చూపించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలకుండా దోమలు నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 400 గ్రామాల్లో స్ప్రేయింగు చేయాలని, స్ప్రేయింగుకు సరైన పద్ధతిలో సంబంధిత అధికారుల పర్యవేక్షణలో జరగాలని తెలిపారు. ఇందుకు స్థానికులు, ఉద్యోగులు సహకారం తీసుకొని సమన్వయంతో పూర్తిచేయాలన్నారు. డెంగీ పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందని, డ్రైడే తప్పని సరిగా పాటించాలని తెలిపారు. కాలువల్లో పూడికతీత, బహిరంగ స్థలాల్లో నీరు నిల్వలేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్యఆరోగ్య అధికారి డాక్టర్ కె.విజయపార్వతి, డిఐఒ డాక్టర్ ఎం.నారాయణ, ఇతర అధికారులు డాక్టర్ ఎం.వినోద్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ డిఎల్ఆర్ రఘుకుమార్, డాక్టర్ టి.జగన్మోహన రావు, మెడికల్ ఆఫీసర్లు, సిహెచ్‌సి, పిహెచ్‌సి డాక్టర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

కౌంటింగ్‌గైనా సజావుగా సాగేనా?

రోజూ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎన్నికల కౌంటింగైనా సజావుగా సాగేనా? లేక పోలింగ్ రోజు సిబ్బంది పడ్డ అవస్థలు తిరిగి కొనసాగుతాయా? అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమౌతున్నాయి. కౌంటింగ్ సజావుగా జరగకపోతే ఫలితాల వెల్లడిలో ఆలస్యం అనివార్యమవుతుంది. అదే జరిగితే దాదాపు 21రోజులుగా ఉత్కంఠగా ఎదురు చూస్తున్న ప్రజానీకం తీవ్ర నిరాశకు గురికావాల్సి వస్తుంది. ఈనెల 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైన సంగతి తెలిసిందే. సిబ్బంది మూడు రోజులపాటు పోలింగ్ నిర్వహణలోనే ఉండిపోయారు. వారికి నిద్రహారాలు లేవు. ఆహారం సమకూర్చడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారు. కొన్నిచోట్ల పాచిపోయిన ఆహారాన్ని ఇవ్వడంతో వాటిని భుజించలేని పరిస్థితి. కానీ, ఆహారం పేరిట రూ.లక్షల ఖర్చు చేసినట్టు సమాచారం. ఈ సంగతి అటుంచితే, ఆ రోజు ఉదయం 12గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ ఎన్నికల సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు ప్రయత్నం చేయలేదు. ఈ ప్రభావంతో రాత్రి వరకు పోలింగ్ సాగింది. దీంతో, సిబ్బంది అష్టకష్టాలు చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. చివరికి పోలింగ్ వివరాలు కూడా మరుచటి రోజు రాత్రి వరకు ఇవ్వలేని దుస్థితి దాపురించింది. మునుపటికి భిన్నంగా ఇవిఎం బాక్సులన్నీ నేరుగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రిషప్షన్ కేంద్రాలకు రప్పించడంతో గందరగోళ పరిస్థితి నెలకుంది. వాటిని అప్పగించి తిరుగు ప్రయాణం అయ్యేసరికి మరుచటిరోజు మధ్యాహ్నం వరకు సమయం పట్టింది. ఈ జాప్యం వివిధ పార్టీలు, స్వతంత్ర్య అభ్యర్థులు, వారి తరపు ఏజెంట్లును అసహనానికి గురిచేసింది. ఇంత కష్టపడినా తమకు తగిన పారితోషికం ఇవ్వలేదంటూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయులు వినతిపత్రం కూడా జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఈనేపథ్యంలో కౌటింగ్ నిర్వహణపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. పోలింగ్ నిర్వహణపై వందల కొద్దీ సమావేశాలు, శిక్షణా తరగతులు, ఇందుకోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ విఫలమైన నేపథ్యంలో ఇప్పటికైనా తగిన ప్రణాళికతో ముందుకు సాగుతారా? లేక ఇప్పటి మాదిరిగా ప్రకటనలకే పరిమితమౌతారా? అన్న సందేహాలు వ్యక్తమౌతున్నాయి. పార్టీలు, ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థుల కోపతాపాలు చదురు ముదురు సంఘటనల వరకు వెళ్లే పరిస్థితి లేకుండా ఉండాలంటే సాయంత్రంలోపే ఫలితాలు వచ్చే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. చీకటిపడితే ఆకతాయిలు, అల్లరిమూకలను పోలీసులు కంట్రోల్ చేయడం కత్తిమీద సాములా మారే ప్రమాదం లేకపోలేదు. అధికారులు ప్రణాళిక, ఆచరణ ఎలా ఉంటుందో వేచిచూల్సిందే.

కౌంటింగ్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి : కలెక్టర్

విజయనగరం కోట : కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లన్నీ పక్కాగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్‌పి దీపికా పాటిల్ తో కలసి లెండి కాలేజ్, జె ఎన్‌టియుజిలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. కౌంటింగ్ సిబ్బందికి, మీడియాకు ఏ ఒక్కరికీ మొబైల్ ఫోన్లు కౌంటింగ్ కేంద్రాల లోపలికి అనుమతి లేనందున మొబైల్ ఫోన్ డిపాజిట్ వాటర్ ప్రూఫ్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్ ఏజెంట్ల కు , అభ్యర్థులకు ప్రత్యేకంగా టెంట్లను ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మీడియా వారికోసం మీడియా రూమ్ ఏర్పాటు చేయాలని, మీడియా వారిని కౌంటింగ్ కేంద్రం వద్దకు పోలీస్ ఎస్కార్ట్ తో పంపాలని తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి, ఏజెంట్లకు, భోజన ఏర్పాట్లు, తాగు నీరు, టెంట్ లను ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ వద్ద డ్రైవర్ల కు కూడా షెడ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. మెయిన్ గేట్ వద్ద ఐడి కార్డ్ ను చూసి లోపలకి పంపాలని, రెండు దశలలో చెకింగ్ ఉండాలని ఎస్‌పికి సూచించారు. కలెక్టర్ వెంట జెసి కార్తీక్, డిఆర్‌ఒ అనిత, ఆర్‌డిఒ సూర్య కళ, డిప్యూటీ సిఇఒ రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

రేపు పలు ప్రాంతాలకు విద్యుత్తు నిలుపుదల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 24న ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుతు సరఫరా నిలిపివేయనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ పి.హరి తెలిపారు. 33/11 కెవి కలెక్టరేట్ సబ్ స్టేషన్ లో గలపలు ఫీడర్లలో మరమ్మతుల కారణంగా సరాఫరా నిలిచిపోతుందని తెలిపారు. 11 కెవి ఈస్ట్ కోస్ట్ ఫీడర్ మీద ఉన్న పావని నగర్ , అరుంధతి నగర్, కాంబోయి వీధి, రెల్లివీధి , గణేష్ కోవెల రోడ్ , 11 కెవి, బాలాజీ నగర్ ఫీడర్‌పై ఉన్న మర్రి చెన్నారెడ్డికాలనీ, సిక్కులకాలనీ, రామయ్యమ్మ కాలని, బిసి కాలనీ , యాతపేట, జర్నలిస్ట్ కాలనీ, రాజులకాలనీ, ద్వారపూడి రోడ్ ,రెవిన్యూకాలనీ, బ్యాంకు కాలనీ, సాయి కీర్తన నగర్ ,కామాక్షి నగర్ , సాయి లలితా నగర్, కెయల్ పురం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 294

ప్రజాశక్తి-బొబ్బిలి

పోస్టల్ ద్వారా 294 ఓట్లు పోస్టల్ బ్యాలెట్ వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. సాయిశ్రీ చెప్పారు. ఈనెల 7 నుంచి 18 వరకు 199ఓట్లు, 20న 50, 21న 13, 22న 32 ఓట్లు వచ్చినట్లు చెప్పారు. పోస్టల్ ద్వారా వచ్చిన ఓట్లు రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులో వేస్తున్నామని చెప్పారు. జూన్ 3వరకు పోస్టల్ ద్వారా వచ్చిన ఓట్లను స్వీకరిస్తామని తెలిపారు.

సర్కారు బడుల్లో సమస్యల తిష్ట

చదువు కోసం బయట ప్రాంతాలకు విద్యార్థులు ● గ్రామాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలని వినతి

రక్షణ గోడ లేని కొత్తగూడ ఆశ్రమ పాఠశాల

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జూన్ 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. మండలంలోని 170 పాఠశాలల ఉన్నాయి. ఇందులో మండల పరిషత్ 56, ప్రభుత్వ ప్రాథమిక 32, ఆశ్రమ పాఠశాలలు 13, ఎయిడెడ్ 4, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు 65ఉన్నాయి. తాడికొండ, దుడ్డు ఖల్లు, టిక్కుబాయి, కొత్తగూడ, కోసింగిభద్ర ఆశ్రమ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. అడవి, కొండల సమీపంలో పాఠశాలల నిర్వహణ ఉండడంతో రాత్రి వేళల్లో ఏదైనా అడవి జంతువు, విష సర్పాలు వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థులు భయపడుతున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మినరల్ వాటర్ అందుబాటులో లేకుండా పోయింది. గతంలో ఏర్పాటు చేసిన ప్లాంట్ల పాడవ్వడంతో మూలకు చేరాయి. మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రన్నింగ్ వాటర్ అందుబాటులో లేకపోవడంతో మరుగుదొడ్లు వినియోగం లేకుండా పోయాయి. రానున్నది వర్షాకాలం కావడంతో విద్యార్థులు రోగాల బారిన పడే అవకాశం ఉంది. చదువుకునేందుకు వస్తున్న విద్యార్థులు అనారోగ్యంతో ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యగా ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. గత కొన్నేళ్ల నుంచి ఆదివాసీ ఆరోగ్య సిబ్బంది లేకపోవడంతో వార్డెన్లు నియమించుకొని నెలవారీగా కొంత మొత్తం చెల్లిస్తున్నారు.

పదేళ్లుగా బయట చదువులకు విద్యార్థులు

మండలంలోని డుమ్మంగి, బొడ్డిడి గ్రామాల్లోని ఎయిడెడ్ పాఠశాలలు మూతపడ్డంతో గత పదేళ్లుగా విద్యార్థులు చదువుకునేందుకు ప్రతిరోజూ బయట ప్రాంతాలకు వెళ్లి వస్తున్నారు. డుమ్మంగి నుంచి 20 మంది విద్యార్థులు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న గుమ్మలక్ష్మీపురం, ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్తగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. మరోవైపు బొడ్డిడిలో పాఠశాల లేకపోవడంతో ఆ గ్రామ చిన్నారులు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్దఖర్జలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లి చదువులు సాగిస్తున్నారు. ఎండకు, వర్షానికి ఇబ్బందులు పడుతూ తమ పిల్లలు చదువుకోవాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఇంటి నుంచి చదువు కోసం వెళ్లిన పిల్లలు ఎప్పుడు వస్తారోనని వేయికళ్లతో ఎదురుచూడాల్సి వస్తుందన్నారు. డుమ్మంగిలో ఐటిడిఎ ఆధ్వర్యంలో పాఠశాల ఏర్పాటు చేసి ఇద్దరు ఉపాధ్యాయులను నియమిస్తామని అధికారులు హామీ ఇచ్చినా నేటికీ నియమించలేదని సర్పంచి పాలక క్రాంతి కుమార్ తెలిపారు. డుమ్మంగి, పి.ఆమిటి గ్రామాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలని గత కొన్నేళ్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించలేదని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికైనా గ్రామాల్లో పాఠశాలల ఏర్పాటు చేసి చిన్నారులకు స్థానికంగా విద్యాబోధన చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కౌంటింగ్ తర్వాత గొడవలపై దృష్టి

అనుమానిత ప్రదేశాల్లో పోలీసుల అవగాహన

ప్రజాశక్తి - సాలూరు

సాధారణ ఎన్నికల పోలింగ్ ముగిసింది. ఇక మిగిలింది ఓట్ల లెక్కింపు మాత్రమే. పోలింగ్ రోజున మండలాల్లో గానీ, పట్టణంలో గానీ ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఓట్ల లెక్కింపు తర్వాత ఎక్కడెక్కడ గొడవలు జరిగే అవకాశం ఉందన్న దానిపై పోలీసులు దృష్టి సారించారు. గతంలో ఎన్నికల సందర్భంగా గొడవలు జరిగిన సందర్భాలను దృష్టిలో పెట్టుకొని ఆయా ప్రాంతాల్లో మళ్లీ గొడవలు తలెత్తకుండా పట్టణ పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నారు. టౌన్ సిఐ వాసు నాయుడు మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ గొడవలు జరగడానికి అవకాశం వుందో అక్కడ స్థానికులతో, యువకులతో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం పట్టణంలోని అక్కేనవీధి రామమందిరం వద్ద స్థానికులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపు ఓటముల పై పందేలు కాయొద్దని, అవి గొడవలకు దారి తీసే అవకాశం ఉందని చెప్పారు. ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదని చెప్పారు. పోలీసుశాఖ హెచ్చరికలను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ కెవి సురేష్, రూరల్ ఎస్ఐ ఎంవి రమణ ఉన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న సిఐ వాసునాయుడు

కెజిబివి ఉపాధ్యాయులను కొనసాగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్రంలోని కెజిబివి పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రత్యేక అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఎటువంటి నిబంధనల్లేకుండా యధావిధిగా కొనసాగించాలని "సామాజిక చైతన్య వేదిక" ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత విద్యా సంవత్సరం పనితీరును బట్టి మరుసటి సంవత్సరం కొనసాగించాలనే ఆలోచన మానుకోవాలని కోరారు. కెజిబివిలను బలోపేతం చేసి బాలికల విద్యను ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.

అచ్చపువలసలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని అచ్చపు వలస గిరిజన గ్రామంలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌సి భాగ్యరాధ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో 90శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు రైతు భరోసా కేంద్రాల్లో దొరుకుతాయని మండల వ్యవసాయ అధికారి పి.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

మక్కువ: భూసారాన్ని పెంచేందుకు అవసరమయ్యే జీలుగు, పిల్లిపెసర, కట్టెల జనుము విత్తనాలను రాయితీపై ప్రభుత్వం అందిస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90శాతం, బిసి రైతులకు 50శాతం రాయితీపై విత్తనాలు అందజేస్తున్నట్టు తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, పాసు పుస్తకం తీసుకుని ఆర్ బి కె కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. 50శాతం రాయితీతో జీలుగు కట్టే విత్తనాలకు రూ.440 పిల్లి పెసరకు రూ.134 చెల్లించాలని తెలిపారు. గతేడాది మాదిరిగానే ఈఏడాదీ 150 క్వింటాళ్లు విత్తనాలు మండలానికి అవసరమవుతుందని తెలిపారు.

రోడ్లపైనే మురుగునీరు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని బెలగాంలో గల గూడ్‌షెడ్ రోడ్డుకు ఆనుకొని రెండు వీధుల్లోఉన్న కాలువల్లో పూడికలు తీయకపోవడంతో మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో ఈ ప్రాంతం దుర్గంధభరితంగా మారి స్థానిక ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నప్పటికీ మున్సిపల్ ప్రజారోగ్య శాఖ అధికారులు గానీ, వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శి గాని, కనీసం కన్నెత్తి చూడకపోవడం బాధాకరమని అవార్డు ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తూ, అవార్డు లో పారిశుధ్య నిర్వహణ యుద్ధ ప్రాతిపదికన చేయాలని కోరుతున్నారు.

దరఖాస్తు చేసిన ప్రతి గిరిజన విద్యార్థికీ సీటివ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో సీటు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి గిరిజన విద్యార్థికి సీటు ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు మాట్లాడుతూ మన్యం జిల్లా పరిధిలోని సీతంపేట, పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని 8 గిరిజన గురుకుల కళాశాలల్లో 1030 సీట్లకు 2572 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సీట్లు పెంచి ప్రతి గిరిజన విద్యార్థికి సీటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని కొమరాడ గిరిజన గురుకుల బాలుర పాఠశాలను ఇంటర్ స్థాయికి పెంచుతామని ప్రకటన చేసిన జరగలేదని అన్నారు. అలాగే ప్రతి సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారి (ఎటిడబ్ల్యుఒ) పరిధిలోని రెండు (బాలికలకు ఒకటి, బాలురకు ఒకటి చొప్పున) గిరిజన ఆశ్రమ పాఠశాలలను కళాశాల స్థాయి చేసి ఇంటర్ చదువులు అందిస్తామని అధికారులు, పాలకులు చెప్పినా ఆచరణలో అమలు కాలేదని వారన్నారు. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన జిల్లాలో ఇంటర్ గిరిజన గురుకుల విద్యాలందరికీ అందేలా జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒలు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరుపయోగంగా జనరేటర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ సరఫరా లేని సమయంలో విధులకు ఆటంకం లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జనరేటర్ వినియోగించకపోవడంతో నిరుపయోగమైంది. ఆరేళ్ల క్రితం గుమ్మలక్ష్మీపురం తహశీల్దార్ కార్యాలయానికి జనరేటర్ మంజూరు చేశారు. అయితే కార్యాలయం శిథిలమవ్వడంతో నూతన భవనంలోకి విధులను ప్రారంభించారు. నూతన కార్యాలయానికి జనరేటర్ మాత్రం తీసుకువెళ్లకుండా వదిలేశారు. నాటి నుంచి నేటి వరకు వినియోగం లేకపోవడంతో మూలన పడింది. లక్షలాది రూపాయల విలువైన వస్తువులను మూలన విడిచిపెట్టడం పట్ల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లక్షలాది రూపాయలు విలువైన ప్రజాధనం వినియోగంలోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కార్టూన్ పోటీలో భాస్కరరావుకు బహుమతి

ప్రజాశక్తి-బొబ్బిలి

తొలి కార్టూనిస్ట్ తెలిశెట్టి రామారావు జయంతి సందర్భంగా నిర్వహించిన కార్టూన్ పోటీల్లో బొబ్బిలి పట్టణానికి చెందిన కార్టూనిస్ట్ గుంట్రెడ్డి భాస్కరరావు ప్రతిభ కనబరిచారు. భాను పేరుతో గీసిన కార్టూన్ బహుమతిని కైవశం చేసుకుంది. హైదరాబాద్ లో చలనచిత్ర నటులు హర్షవర్ధన్, సంఘసేవకులు సత్యవాణి ఆయనకు అందజేశారు. కార్టూన్‌కు బహుమతి తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని భాస్కరరావు చెప్పారు.

సరే పోలమ్మతల్లికి వెండి ఆభరణాలు వితరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

యుద్ధ స్తంభం వద్ద ఉన్న సరే పోలమ్మతల్లి ఆలయానికి వెన్నెల ఎస్టేట్స్ అధినేత వట్టూరి నరేష్ నాలుగు కిలోల వెండి ఆభరణాలను వితరణ చేశారు. ఆలయ ధర్మకర్త బి.సత్యనారాయణ సమక్షంలో ఆభరణాలతో సరే పోలమ్మతల్లి విగ్రహాన్ని అలంకరించారు. అభయ హస్తాలు, వడ్డాణం, సటారీ, పల్లెం తయారు చేసి, అమ్మవారికి సమర్పించారు.

ఇంకుతున్న నీరు.. ఎండిపోతున్న బోర్లు

అధిక సంఖ్యలో మరమ్మతులకు గురైన బోర్లు

మరమ్మతుకు గురై, వృథాగా ఉన్న బోరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో నగరంలో రోజు రోజుకూ నీటిసమస్య అధికమవుతోంది. తాగునీటికి ముషిడిపల్లి, నెల్లిమర్ల పంప్ హౌస్‌ల నుంచి వచ్చే నీరే నగరంలో ఉన్న మూడున్నర లక్షలమందికి ఆధారం. రెండు పంప్ హౌస్‌ల నుంచి వస్తున్న నీరు కేవలం తాగేందుకు మాత్రమే సరిపోతుంది. అధి కూడా రెండు రోజులుకు ఒక సారి సరఫరా చేస్తున్నారు. దీంతో నగర ప్రజలు నీటి అవసరాలు దృష్ట్యా నగరంలో సుమారుగా 1100 చేతి పంపు బోర్లు ఉన్నాయి. ఈ బోర్లలో సుమారుగా 300కు పైగా బోర్లు మరమ్మత్తులకు గురయ్యాయి. మరో 250కి పైగా బోర్లులో నీరు ఇంకిపోయి వృథాగా దిష్టి బొమ్మల్లా మారాయి. ఏడాదిగా వీటి గురించి పట్టించుకోకపోవడంతో ఒక్కొక్కటిగా పాడైపోతున్నాయి. రోజురోజుకూ నీటి అవ సరాలు పెరుగుతున్నాయి. విజయనగరంలో కుళాయిల ద్వారా ఇస్తున్న నీరు ఎటూ సరిపోని పరిస్థితులు నెలకొన్నాయి. పైగా వీధుల్లో ఉన్న చేతి పంపులు మొరాయిస్తున్నాయి. మరమ్మతుల్లేక బోరుమంటున్నాయి. నగరంలో డివిజన్ పరిధిలోని నాగోజీపేట ప్రాంతంలోనే మూడు బోర్లు పాడయ్యాయి. కణపాక లో ఉన్న బోర్లలో నీరు ఇంకిపోతోంది. గత ఆరు నెలల నుంచి బోర్ల మరమ్మతుకు సామగ్రి కొనుగోలులో అధికారులు నిర్లక్ష్యం వహించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో సుమారుగా 20పైగా ఉన్నాయి. వాటిలో పదికి పైగా నీరు లేక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

కనపాకలో నీరు రాని బోరు

మరి కొన్ని మరమ్మత్తులకు గురయ్యాయి. నగరంలో 50 డివిజన్లలోని అన్ని బోర్లదీ ఇదే పరిస్థితి. దీంతో బోర్లు ఆధారంగా ఉన్న కాలనీలు, శివారు ప్రాంతాల్లో నీటి ఇబ్బందులు అధికంగా ఉన్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి ఒక రోజు ముందు బోర్ల మరమ్మతులకు టెండర్లు పిలిచారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి రావడంతో టెండర్లు తెరవలేని పరిస్థితి నెల కొంది. టెండర్లు తెరిచేందుకు జిల్లా ఎన్నికల అధికారి నుంచి అనుమతికి ఇంకా రాలేదని డిఇఇ ఎస్.అప్పారావు తెలిపారు. మంచినీటి బోర్లు నిర్వహణకు సంబంధించిన అంశం కావడంతో ఎన్నికల కమిషన్ నుంచి అనుమతికి ప్రయత్నిస్తున్నట్లు ఆయన చెప్పారు. అయినా నగరంలో ఎక్కడైనా బోర్లు పని చేయకపోతే పిర్యాదు చేస్తే వెంటనే మరమ్మత్తు చేస్తామని డిఇ తెలిపారు.

బావిలో పడి ఆర్‌టిసి ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రమాదవశాత్తూ బావిలో పడి ఆర్‌టిసి ఉద్యోగి మృతి చెందినట్లు పెదమానాపురం ఎస్ఐ శిరీష తెలిపారు. విశాఖకు చెందిన కుంచర్లపాటి శివాజీకుమార్ (60)తో పాటు మరో నలుగురు చినకాదలో జరిగిన పండగకు వెళ్లారు. మరుగుదొడ్డికి వెళ్లి వస్తానని బయలకు వెళ్లిన శివాజికుమార్ ఎంతకూ బంధువుల ఇంటికి రాకపోయేసరికి వెతికారు. ఆయన మృతదేహం గ్రామ సమీపంలోని నేల బావిలో లభించింది.

టిడిపి కార్యకర్తకు పరామర్శ

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస మండలం వీరభద్రపురం గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త చింతాడ అర్జున్‌రావు ఎన్నికల రోజు కాలువలో పడి పోయిన కారణంగా కాలికి గాయం తగిలింది. కుటుంబ సభ్యులు ఎస్.కోట పట్టణ కేంద్రంలో గల వరలక్ష్మి హాస్పిటల్ లో చేర్పించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం బాధితున్ని పరామర్శించారు. అనంతరం రూ.15వేలు ఆర్థిక సహాయం అందించారు. భవిష్యత్‌లో కూడా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పొట్నూరు రత్నాజి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా జగనన్న లేఅవుట్

వల్లంపూడి గ్రామంలో నిరుపయోగంగా జగనన్న లేఅవుట్

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో వల్లంపూడి గ్రామంలో జగనన్న లేఅవుట్ నిరుపయోగంగా మారింది. ఈ లేఅవుట్‌లో 48 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. లేఅవుట్ లోతట్టు ప్రాంతంలో ఉంది. ఎత్తుగా ఉన్న స్థలంలో పది మంది వరకు ఇళ్ల నిర్మించుకున్నారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న వారు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదు. గ్రామస్తుల వాడుకనీరు లేఅవుట్‌లోకి వచ్చి చేరుతుంది. ఏమాత్రం వర్షం కురిసినా అదంతా చెరువులా తయారవుతుంది. దీంతో లేఅవుట్‌ను ఎత్తు చేస్తే తప్ప ఇళ్ల నిర్మించుకోలేమని లబ్ధిదారులు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు స్పష్టంచేశారు.

సమస్య పరిష్కారానికి అవసరమైన నివేదికను జిల్లా అధికారులకు పంపామని చెప్పడమే తప్ప నేటికీ ఎత్తు చేయలేదు. దీంతో లేఅవుట్ స్థలంలో కొందరు పందులకు పాకలు వేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, స్థలాన్ని ఎత్తు చేయాలని ఇళ్ల స్థలాల లబ్ధిదారులు కోరుతున్నారు.

నిరసన శిబిరంలో పాల్గొన్న జిందాల్ కార్మికులు

ఆరో రోజుకు జిందాల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ కర్మాగారం వద్ద కార్మికులు చేపట్టిన నిరసన బుధవారం ఆరో రోజుకు చేరింది. విజయనగరం డిసిఎల్ వద్ద జరిగిన చర్చలు విఫలం కావడంతో కార్మికులు ఆందోళనను కొనసాగించారు. పరిశ్రమ ఎదుట వంటావార్పు కొనసాగిస్తున్నారు. జిందాల్ యాజమాన్యం లేఆఫ్ ఎత్తివేసి, కార్మికులకు స్థానికంగా పని కల్పించాలని ఆయా యూనియన్ల నాయకులు డిమాండ్ చేశారు. అప్పటివరకూ నిరసన కొనసాగిస్తామని స్పష్టంచేశారు. బుధవారం వంటావార్పు కార్యక్రమానికి తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు సహకరించారు.

కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ, టిఎన్‌టియుసి నాయకులు పిల్ల అప్పలరాజు, సలాది భీమయ్య, వైఎస్ఆర్‌టియుసి నాయకులు లగుడు వామాలు, పెదిరెడ్ల ప్రసాద్, నమ్మి చినబాబు, బొట్ట రాము, బాలిబోయిన ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి రైతుల ఎంపిక

ప్రజాశక్తి-రేగిడి

గ్రామాల్లో పండ్ల తోటల పెంపకానికి చిన్న, సన్నకారు రైతులను ఎంపిక చేసి, నివేదికలు తయారు చేసి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఎపిడి మీసాల శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు బుధవారం ఉపాధి కార్యాలయంలో సాంకేతిక, క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల పెంపకానికి మొగ్గు చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పండ్ల తోటల పెంపకంతో ఆర్థికంగా రైతులు బలోపేతం కావచ్చునని తెలిపారు. అన్ని పంచాయతీల్లో వేతనదారులందరికీ పనులు కల్పించాలన్నారు. రోజువారి కూలి రూ.300 వచ్చేవిధంగా కొలతలు ఇచ్చి పనిచేయించాలని తెలిపారు. మెట్టు పొలం ఉన్న సన్న, చిన్నకారు రైతులకు పండ్లతోటలు వేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. తోటలున్న రైతులకు కందకాలు, చెట్టు చుట్టూ చిన్ననీటి కుంటలు తవ్వుటకు అవకాశం ఉందని తెలిపారు.

మాట్లాడుతున్న ఎపిడి శ్రీనివాసరావు

90 రోజులు హౌసింగ్ పేమెంట్ చేయాలని సూచించారు. మేట్లు ప్రతిరోజూ ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు పంపించాలని తెలిపారు. పనుల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ హరినాథ్, ఇసి రామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-రామభద్రపురం

ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ఉపాధి హామీ జిల్లా అంబుడ్స్‌మెన్ శతపతి అన్నపూర్ణ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో క్షేత్ర, సాంకేతిక సహాయకులు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి కొత్త పనులు మంజూరుతోపాటు ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు కచ్చితంగా వంద పని దినాలు ఉండేటట్లు ప్రణాళిక సిద్ధం చేశారని తెలిపారు. పని ప్రదేశాల్లో మంచినీటి సరఫరా, వైద్య సౌకర్యాలు కల్పిస్తూ నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మస్టర్లు వేసేటప్పుడు క్షేత్ర సహాయకులు పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది, ఎంపిడిఒ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సమావేశానికి ముందు గజపతినగరం క్లస్టర్ ఎపిడి జనార్ధనరావుతో కలిసి ఎపిఒ త్రినాథరావు దుప్పులపూడి, ఇట్లమామిడిపల్లి గ్రామాల్లో పనులను, మస్టర్లను పరిశీలించారు. సమావేశంలో సాంకేతిక సహాయకులు శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా అంబుడ్స్‌మెన్ అన్నపూర్ణ

ఆక్రమణలు గుర్తింపు

ఆక్రమణలను పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వావిలపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 96, 99లోని చెరువు గట్టును క్వారీ యజమానులు ఆక్రమిస్తున్నారని కొంతమంది తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. దీంతో తహశీల్దార్ సత్యం ఆదేశాల మేరకు బుధవారం ఆ ప్రాంతాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు. క్రషర్ యజమాని ఆక్రమణలు తొలగించాలని, లేకుంటే తామే తొలగిస్తామని అధికారులు హెచ్చరించారు. దీనిపై సంబంధిత నీటిపారుదల శాఖ ద్వారా పరిశీలన చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్ అప్పలనాయుడు, గ్రామ సచివాలయ సర్వేయర్ నవీన్, విఆర్ఒ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చదరంగం పోటీలు

ప్రజాశక్తి-డెంకాడ

డెంకాడ శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. విజేతలుగా దిలీప్, మహీధర్ నిలిచారు. వీరికి త్వరలో బహుమతులు అందించనున్నట్లు శాఖా గ్రంథాలయాధికారి మహేష్ తెలిపారు.

చదరంగం పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి మహేష్

విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇస్తున్న గ్రంథాలయాధికారి చంద్రశేఖర్

వేపాడ శాఖా గ్రంథాలయాధికారిగా చంద్రశేఖర్

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ శాఖా గ్రంథాలయాధికారిగా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ గ్రంథాలయాధికారిగా పనిచేస్తున్న స్వామినాయుడు జామి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా వేసవి శిబిరంలో భాగంగా విద్యార్థులకు ఆయన కంప్యూటర్ శిక్షణ ఇచ్చారు.

ఐకాన్ అవార్డు అందుకుంటున్న విజయమోహన్

విజయమోహన్‌కు ఐకాన్ అవార్డు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆంగ్ల ఉపాధ్యాయులు మింది విజయమోహన్ జాతీయ స్థాయి ఇండియన్ ఐకాన్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆంగ్ల భాషాభివృద్ధికి విజయమోహన్ ఎంతో కృషి చేశారు. మార్చిలో ఇండియా టుడే మీడియా నిర్వహించిన కైట్స్ క్రాఫ్ట్ ఆన్‌లైన్ సమావేశంలో విజయమోహన్‌ను ఎంపిక చేశారు. విజయమోహన్‌ను డెల్టా గౌరవ అధ్యక్షులు ఎం.గుంపస్వామి, సభ్యులు ఎం.రామకృష్ణ, పి.శ్రీనివాస, ఎం.మురళీబాబు, ఎస్.జగన్మోహన్ అభినందించారు.

లిఫ్ట్ ఇచ్చి చైన్ కొట్టేశాడు

వివరాలు వెల్లడిస్తున్న సిఐ వెంకటరావు

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన నిందితుడిని 24గంటల్లోనే అరెస్టు చేసి, అతని నుంచి చోరీ చేసిన చైను, స్కూటీని రికవరీ చేసినట్లు వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు బుధవారం తెలిపారు. నగరంలోని కొత్త అగ్రహారం ఆంజనేయ స్వామి గుడి వద్ద గాజులరేగ వెళ్లేందుకు అరబిందోలో పని చేస్తూ, గాజులరేగలో నివాసం ఉంటున్న కె.షణ్ముఖ వెంకటేష్ మంగళవారం ఆటో కోసం వేచి ఉండగా, ఒక వ్యక్తి స్కూటీ పై వచ్చి, తాను కూడా గాజులరేగ వైపు వెల్తున్నానని, లిఫ్ట్ ఇస్తామని చెప్పడంతో షణ్ముఖ వెంకటేష్ అతని స్కూటీ ఎక్కాడు. మార్గ మధ్యంలో మాటల్లో పెట్టి, అతని మెడలోని చైను దొంగిలించాడు. ఈ విషయాన్ని తరువాత గుర్తించిన షణ్ముఖ వెంకటేష్ వన్ టౌన్ పిఎస్‌లో ఫిర్యాదు చెయ్యగా, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. వన్ టౌన్ క్రైమ్ ఎస్సై తారకేశ్వరరావు, క్రైం హెచ్‌సి అచ్చిరాజు, ఇతర పోలీసు బృందం దర్యాప్తు ప్రారంభించి, చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన వారు పట్టణంలోని లంకాపట్నంకు చెందిన దనాన యేసుగా గుర్తించారు. బుధవారం ఎన్‌సిఎస్ థియేటర్ దగ్గరలో అరెస్టు చేసి, చోరీ చేసిన బంగారు చైను, ఉపయోగించిన స్కూటీని స్వాధీనం చేసుకొని, నిందితుడిని రిమాండుకు తరలిస్తున్నట్లుగా వన్ టౌన్ సిఐ బి.వెంకటరావు తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తుల వాహనాలు ఎక్కే ముందు వారి వాహనాల నంబరును గుర్తు పెట్టుకోవడం చాలా అవసరమని, అనుమానం ఉంటే అటువంటి వ్యక్తుల వాహనం ఎక్కపోవడం ఉత్తమమని తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL JUNIOR CIVIL JUDGE: VIZIANAGARAM
O.S.No.539/2023

Between:
Nakka Krishna ......Plaintiff
And:
Smt. AvalaRamulamma and others ....Defendants

NOTICE TO DEFENDANT No.2
Bammidi Ramaswamy S/o late Rama swamy, Bantupalli Village, Denkada Mandal, Vizianagaram District.

NOTICE
Please take notice that the above named plaintiff filed the above numbered suit i.e., O.S. No. 539/2023 against defendants No.1 to 4, for permanent injunction to restraining the defendants by the plaintiff, in the meanwhile as per the Honourable Court Orders issue notice to the 2nd defendant, and the same stands posted to **31-7-2024.** On that day you have to appear before this Honourable court either personally or through an Advocate by **10.30 A.M.** along with your documents, failing which the matter will be decided in your absence as per Law.

// BY THE ORDER OF THE HONOURABLE COURT//

MAJJI YOGESWARA RAO,
ADVOCATE FOR THE PLAINTIFF,
VIZIANAGARAM.

IN THE HONOURABLE COURT OF THE 1st ADDITIONAL JUNIOR CIVIL JUDGE : VIZIANAGARAM
I.A. No. 422/2023 in O.S.No.539/2023

Between:
Nakka Krishna ....Petitioner
And:
Smt. Avala Ramulamma and others ...Respondents

NOTICE TO RESPONDENT No.2
Bammidi Ramaswamy S/o late Rama swamy, Bantupalli Village, Denkada Mandal, Vizianagaram District.

NOTICE
Please take notice that the above named petitioner filed the petition i.e., I.A.No.422/2023 against respondents No.1 to 4, for permanent injunction to restraining the respondents by the petitioner, in the meanwhile as per the Honourable Court Orders issue notice to the 2nd respondent, and the same stands posted to **31-7-2024.** On that day you have to appear before this Honourable court either personally or through an Advocate by **10.30 A.M.** along with your documents, failing which the matter will be decided in your absence as per Law.

// BY THE ORDER OF THE HONOURABLE COURT//

MAJJI YOGESWARA RAO,
ADVOCATE FOR THE PLAINTIFF,
VIZIANAGARAM.

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
OS 329/2017 EP 41/2022

Between:
Reddi Maheswara Rao .....DHR
And :
Pasumarthi Krishnavenu & another ....JDRS

To
1. Pasumarthi Krishnavenu W/o Sattibabu, R/o Buradapadu Village & Post, Gantyada Mandalam, Vizianagaram Dist.
2. Pasumathi Santosh Kumar S/o Sattibabu, R/o Buradapadu Village & Post, Gantyada Mandalam, Vizianagaram Dist.

వాది పై వాజ్యములోని డిక్రీని Order 21 Rule 54 CPC ప్రకారము అమలు నెరవేర్చుడమునకు గాను యీ కోర్టుకు మనవిజేసుకొని వుండేటందుకు డిక్రీ అమలు నెరవేర్చుడముకు ఎందునిమిత్తం వుత్తర్వు ఇవ్వబడుకూడదో దానిని తెలియజేయడమునకు నీవు **2024 సం॥ జూన్ నెల 26 వ తేదీన** యీ కోర్టు యెదుట హాజరు కావలసినదని మీకు తెలియజేయడమైనది.

T.Purushottama Rao
Advocate for the DHR
Vizianagaram
Cell:9989277448

ప్రకటన
మహారాజశ్రీ గజపతినగరం జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S. 86/2023

Between:
బొబ్బిలి సన్యాసినాయుడు ......వాది
And :
బండారు వెంకటేష్ .....ప్రతివాది

ప్రతివాది : బండారు వెంకటేష్ S/o రామారావు బి.రాజేరు గ్రామం, బొండపల్లి మండలం, విజయనగరం జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీరు వాది వద్ద అప్పు తీసుకుని ప్రోనోటు వ్రాయించి ఇచ్చినారు. సదరు ప్రోనోటు ఆధారం చేసుకుని వారు పై కోర్టులో OS 86/2023 నెంబరు గల దావాను దాఖలు చేసికొని యున్నారు. సదరు దావాలో మీరు కోర్టుకు సదరు తే 24-6-2024 నాటికి వాయిదా అయి యున్నది. సదరు **తే 24-6-2024దీన ఉదయం గం॥ 10-30 నిమిషాల**కు మీరు స్వయంగా గాని లేక మీరు బొగట్టా ఇచ్చిన ప్లీడరు గారు ద్వారా కాని పై కోర్టులో హాజరు కావలసినదిగా ఆజ్ఞాపించడమైనది. పైన చెప్పబడిన తారీఖున మీరు హాజరు కాకుండా తప్పిన యెడల మీరు పరోక్షమందు పై వ్యాజ్యమును (దావా) విమర్శ చేసి తీర్మానించుట జరుగునని మీరు తెలుసుకోవలసినది అని ఈ ప్రకటన ద్వారా తెల్పడమైనది.

శ్రీ కె.రమణాజి, AP 451/1986
న్యాయవాది, గజపతినగరం,
విజయనగరం జిల్లా,
గజపతినగరం
తే 22-05-2024 సెల్ : 9849343322